ఇంజినీరింగ్ విద్యార్థినులకు 'విష్' ఈ - కోర్సు

రాయదుర్గం: టాలెంట్ స్ప్రింట్, గూగుల్ సహకారంతో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదివే విద్యార్థినుల కోసం కొత్త కోర్సును నిర్వహిస్తోంది. 15 నెలల ఆన్‌లైన్ కోర్సును 'ది విమెన్ ఇంజినీర్స్ (డబ్ల్యూఈ) కోర్సును నిర్వహిస్తారు. 2019లో ప్రారంభించిన ఈ కోర్సులో ఇప్పటి వరకు 950 మంది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా మారి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఈ కోర్సులో చేరిన వారికి 50 మంది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థినులకు 100 శాతం స్కాలర్‌షిప్ అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గూగుల్ టెక్నికల్ ఫెలో ఉపాధ్యక్షుడు పార్థరంగనాథన్, టాలెంట్‌స్ప్రింట్ సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూపాల్ మాట్లాడుతూ.. విద్యార్థినులు నైపుణ్యాలను మెరుగుపరుచుకుని భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా మార్చేందుకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. వివరాలకు www.talentsprint.comను సందర్శించాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు 'మనూ'లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లో మహిళా విద్యా విభాగం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' మహిళా విద్యా విభాగాధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ తెలిపారు. ఈ సందర్భంగా 'మహిళల చట్టం, సాధికారత' అనే అంశంపై హైదరాబాద్‌లోని సిబయాసిస్ లా స్కూల్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ సెల్ హెడ్ డాక్టర్ అనితాసేబుల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారన్నారు. 'మనూ' లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజకీయశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ పాల్గొంటారని వివరించారు.

ఆదర్శ గురుకులం

పేదింటి అమ్మాయిల పాలిట వరంగా మారిన ప్రభుత్వ విద్యాసంస్థ

- లక్ష్యాలకు అనుగుణంగా విద్యాబోధన
- ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల సాధనకు శిక్షణ


సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల ప్రధాన భవనం

రాయదుర్గం: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు ఆ గురుకులం ఆదర్శంగా నిలుస్తోంది. తమకు తామే పోటీ అంటూ.. ప్రతి ఏటా మెడికల్ సీట్ల సాధనలో విద్యార్థుల ప్రతిభ అద్వితీయంగా మారింది. పేదింటి అమ్మాయిలను ఇంటర్మీడియట్ వరకు చదువు చెబుతూనే భవిష్యత్తులో డాక్టర్ కోర్సుల్లో చేరేలా ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధిస్తూ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, ఇతర గురుకుల విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తోంది.

- జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఉత్తమ ర్యాంకులు, ప్రతిష్టాత్మకమైన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధిస్తూ.. ఏటేటా తన సత్తాను గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల చాటుతోంది. పదోతరగతి, ఇంటర్మీడియట్ రెగ్యులర్ కోర్సులలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ.. ప్రైవేటు కళాశాలలకు దీటుగా తయారవుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ, పట్టుదలతో చదివే విద్యార్థినులు చదువుతుండటంతో ఏటా


జేఈఈలో ర్యాంకులు సాధించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్

ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. ఆ తర్వాత పేదింటి ఆడపిల్లలను డాక్టరమ్మలను చేసేందుకు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను సాధిస్తూ.. రాష్ట్రంలోనే ఆదర్శ గురుకులంగా ఈ కళాశాల నిలిచింది.

- ప్రతి ఏటా ఇంటర్మీడియట్‌లో బాలికలను చదివిస్తూ.. మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌సీఓ డాక్టర్ శారద పర్యవేక్షణలో గౌలిదొడ్డి కళాశాల ప్రిన్సిపాల్ అంబటిపూడి శారద ఆధ్వర్యంలో కో- ఆర్డినేటర్ వెంకటరమణ నాయకత్వంలో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు.

'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్ పథకం' ద్వారా..

- రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఎంపిక చేసిన వాటిల్లో 2015లో 'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్' పేరిట ప్రత్యేక పథకాన్ని అమలు చేశారు. అప్పటి నుంచి ఈ కళాశాలలో ఎంసెట్, నీట్‌లో బాలికలకు ప్రత్యేక శిక్షణను ప్రారంభించారు. మొదట్లో 120 మందికే ఈ శిక్షణను ఇచ్చారు. అనంతరం 200 మందికి పెంచారు.
- ఏడాదిలో 43 మందికి డాక్టర్ కోర్సుల్లో సీట్లు రాగా.. గతేడాది మందికి సీట్లు వచ్చాయి. ఈసారి మాత్రం 200 మందికి ఎంబీబీఎస్ సీట్లు, బీడీఎస్‌లో 15 సీట్లు వచ్చేలా చేయాలని సంకల్పించి ప్రత్యేక శిక్షణను కొనసాగిస్తున్నారు.

క్రీడల్లోనూ రాణింపు..

- చదువుతోపాటు ఉన్నత విద్య కోసం ఇంటర్మీడియట్ రెగ్యులర్ విద్యను అందిస్తూనే డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యేందుకు నీట్, ఎంసెట్ వంటి పరీక్షలకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం తెలిసిందే.
- తాజాగా క్రీడలలో రాణించే వారిని ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేయడంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులూ తయారవుతున్నారు. గోల్ఫ్ కోర్సులో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని కూడా గురుకుల పాఠశాలలోనే ఏర్పాటు చేయగా.. అందులో విద్యార్థులు రాణిస్తున్నారు.

అన్ని ఫలితాల్లో టాప్‌లోనే నిలవాలన్నదే లక్ష్యం..



అన్ని ఫలితాల్లో మా గురుకులాన్ని టాప్‌లోనే నిలపాలన్నదే లక్ష్యం. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో 100 శాతం సాధనతోపాటు ఈ ఏడాది ఎబీబీఎస్ సీట్లు 200, బీడీఎస్ సీట్లు 15 సాధించాలని, ఇంజనీరింగ్‌లో కూడా చాలా సీట్లను సాధిస్తూ వస్తున్నాం. ప్రభుత్వ చొరవ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల పని చేయాలనే తత్వంతో పనిచేయడం, సమిష్టి కృషి ఫలితంగా లక్ష్యాలను సాధిస్తూ వస్తున్నాం. గ్రామీణ ప్రాంతం నుంచి పేదింటి నుంచి వచ్చిన వారికి మంచి భవిష్యత్తును కల్పిస్తూ.. రావడం చాలా సంతోషంగా ఉంది. అమ్మాయిలకు చదువుతో పాటు ఉన్నత విద్యాసంస్థల్లో సీట్ల సాధనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా బోధన, శిక్షణను ఇస్తున్నాం. – ఏ.శారద, ప్రిన్సిపాల్, గౌలిదొడ్డి గురుకుల బాలికల పాఠశాల

ఇంటర్, టెన్త్ ఫలితాల్లో..

- ప్రతి ఏటా పదోతరగతి, ఇంటర్మీడియట్ రెగ్యులర్‌లో అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. 2023లో టెన్త్‌లో 100 శాతం ఫలితాలు వచ్చాయి. 2023-24లో 98 శాతం ఫలితాలు సాధించింది.
- పేదింటి పిల్లలకు ఉత్తమమైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తూ.. వారికి వారిలో పట్టుదల, పోటీతత్వం, కష్టపడి చదివే అలవాటును చేసుకొనేలా చేస్తోంది. అందుకోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది.

నేడు 'నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే'పై సదస్సు

బాలానగర్: నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే 2024ను పురస్కరించుకొని ఈనెల 6వ తేదీన జేఎన్‌టీయూ ఒకరోజు సదస్సు నిర్వహిస్తున్నామని ప్రొ. ఎస్. శోభారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించే ఈ సదస్సుకు కౌన్సిల్ మెంబర్లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఫార్మసీ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా గురు రవిదాస్ మహరాజ్ జయంతి

బాలానగర్: ఫతేనగర్‌లో సంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ జయంతి వేడుకల్లో ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ మంగళవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కంచి భిక్షపతి, మొహమ్మద్ ఇమ్రాన్, ఫతేనగర్ కమిటీ ప్రెసిడెంట్ కంబ్లే లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ గైక్వాడ్ సంజువ, జనరల్ సెక్రటరీ కంబ్లే సుభాకర్ జైన్, సెక్రటరీ సర్యవన్షి తుకారాం, ట్రెజరర్ మర్కుండి ధనరాజ్, మెంబర్ కంబ్లే రామ్ పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని ప్రగతి కళాశాల వార్షికోత్సవం మంగళవారం అశోకా గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, కరస్పాండెంట్ రవీందర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన దిల్‌ఖుష్‌నగర్ నూతన కమిటీ

బాలానగర్: దిల్‌ఖుష్‌నగర్ నూతన కమిటీ సభ్యులు మంగళవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాదర్, కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన కమిటీకి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మొహమ్మద్ ఖాజా, సయ్యద్ సలీం, మొహమ్మద్ సలావుద్దీన్, ముఖ్తార్, రాజు, మొహమ్మద్ తౌఫిక్, సలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి బోర్, మోటార్ అందజేత



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్‌రెడ్డినగర్‌లో అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన తండ్రి దివంగత వడ్డపల్లి నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం బోరు వేయించి, మోటారు బిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోరును ప్రారంభించారు. అనంతరం ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ప్రభాకర్‌నగర్ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబ్దుల్ బాకీ, సెక్రటరీ దత్తు, సాగర్, రాంరెడ్డి, విష్ణు, శ్రీనివాస్, రాంచదందర్, లింగం, గోపాలకృష్ణ, విశ్వనాథం, అబ్దుల్ కలాం, రమేష్ పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌సీ అభిలాష అభినవ్ పాల్గొన్న అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు

కూకట్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికులకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై మంగళవారం మూసాపేట సర్కిల్ పరిధిలోని ఆంజనేయనగర్ కమ్యూనిటీహాల్‌లో జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అధికారులు డాక్టర్ మహేశ్వర్, డాక్టర్ సిల్వియా, డాక్టర్ రాజేందర్‌రావు, అంకురా ఆస్పత్రి డాక్టర్ శిరీష, రాందేవ్‌రావ్ ఆసుపత్రి డాక్టర్ ఛాయాదేవిలు పాల్గొని పోషకాహారం, రోగ్యం, పరిశుభ్రత, రోజూ పాటించవలసిన జాగ్రత్తలు.. వారు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్మికులు ప్రతి రోజు పోషక విలువలు కలిగిన ఆకు కూరలు, ఉడికించిన కోడిగుడ్లు, పప్పుధాన్యాలు తినాలని సూచించారు. అనంతరం పోషక విలువలతో కూడిన ఆహారం, రోజు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై మన ఆహార పదార్థాలు – ఉపయోగాలు అనే కరపత్రాన్ని అందజేశారు.


- ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సరిగ్గా పనిచేయగలరని అన్నారు. కార్మికులకు అందజేసిన చేతి తొడుగులు, ఇతర పరికరాలు తప్పక వాడాలన్నారు. ప్రతి ఒక్క కార్మికురాలు పని పూర్తయిన తరువాత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలని తెలిపారు. పోషక ఆహార నిపుణులు తెలియజేసిన విషయాలు, సూచనలను తప్పకుండా పాటించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ పద్మజ, డీసీ ఎ. రమేష్, పి.మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటరెడ్డి



మోతీనగర్: అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా సామల వెంకటరెడ్డిని నియమిస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జూన్ 5న అల్లాపూర్ పేరుతో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీపతి ఆంజనేయులు విధులు నిర్వర్తించారు. ఆయనను గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటరెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు.

బస్సు నుంచి కిందపడిన మహిళ



మూసాపేట: ఆర్టీసీ బస్సులో నుంచి ఓ మహిళ కిందపడి గాయాలపాలైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన వరలక్ష్మి(52) బస్సులో కూకట్‌పల్లి వైపు వెళ్తోంది. హెచ్‌సీయూ డిపోకు చెందిన బస్సు నుంచి కిందకు దిగే క్రమంలో పడటంతో ఆమె కాలు విరిగింది. వెంటనే స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఎవరు ఫిర్యాదు చేయకపోవటంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

దెబ్బతిన్న పైపులైన్ల స్థానంలో కొత్తవి వేయాలి


శేషాద్రినగర్‌లో పైపులైన్‌లు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్ రోడ్డు పనులు చేపట్టారు. రోడ్డు పనులతో పైపులైన్ నిర్మాణం దెబ్బతింది. దీంతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అధికారులతో వెళ్లి పరిశీలించారు. దెబ్బతిన్న పైపులైన్ల స్థానంలో కొత్తవి వేయాలని సూచించారు.

లేపాక్షిలో వార్షిక క్లియరెన్స్ మేళా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని నందగిరి హిల్స్‌లో ఉన్న లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్ ఎంపోరియంలో వార్షిక క్లియరెన్స్ సేల్ మేళా చేపట్టినట్లు సంస్థ మేనేజర్ మురళీబాబు మంగళవారం తెలిపారు. పోచంపల్లి బెడ్‌షీట్లు, కలంకారీ బ్యాగులు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, హ్యాండిక్రాఫ్ట్స్‌లో ఎంపిక చేసిన వస్తువులపై 10 నుంచి 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు క్లియరెన్స్ సేల్ మేళా జరుగుతుందన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని టీఎంఆర్ స్కూల్, కళాశాల, బాలానగర్ బాయ్స్ హాస్టల్ వద్ద దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మంగళవారం ఎంటమాలజీ సిబ్బందితో యాంటీ లార్వా దోమల మందును పిచికారి చేయించారు. దోమల నివారణకు తరచూ బ్లీచింగ్ పౌడర్ చల్లి, ఫాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు, శానిటేషన్ సూపర్‌వైజర్ భరత్, రాకేష్, శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంటమాలజీ అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

నాణ్యమైన ఉన్నత విద్యే లక్ష్యం

ఎన్‌ఈపీ డ్రాఫ్ట్ కమిటీ కార్యదర్శి డాక్టర్ షకీలా శంసు



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మూడో ప్రసంగానికి భారత విద్యా మంత్రిత్వ శాఖ మాజీ ఓఎస్‌డీ, జాతీయ విద్యా విధానం డ్రాఫ్ట్ కమిటీ కార్యదర్శి డాక్టర్ షకీలా శంసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. «జాతీయ విద్యా విధానం-2020 ద్వారా ఉన్నత విద్య, దూర విద్యా విధానంలో మార్పులు» అనే అంశంపై ఆమె మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యా విధానంలో అనేక మార్పులు వస్తున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యా వ్యవస్థలో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉన్నత విద్యా విధానంలో ఆన్‌లైన్ కోర్సుల అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఉన్నత విద్యలో ప్రస్తుతం స్థూల నమోదు నిష్పత్తి 27.1 శాతం ఉండగా ఇది 2035 నాటికి 50 శాతం వరకు పెంచాలన్నదే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కొత్త విద్యా విధానం ఐసీటీ ద్వారా డ్యూయల్ మోడ్ ఎడ్యుకేషన్ సిస్టమ్, హైబ్రిడ్ అండ్ బ్లెండెడ్ లెర్నింగ్, డిజిటల్ అండ్ వర్చువల్ విశ్వవిద్యాలయాలను విస్తృతపరచాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు మాట్లాడుతూ.. దేశంలో దూరవిద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అనేక వర్సిటీలకు మార్గదర్శిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్‌ఎన్ రెడ్డి, సికా డైరెక్టర్ శ్రీదేవి, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ 'దండోరా' కొత్త కమిటీ ఎన్నిక

తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కొత్త కమిటీ ప్రకటన


కరపత్రం ఆవిష్కరిస్తున్న దండోరా ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణ మాదిగ హక్కుల దండోరా పాత కమిటీని రద్దుచేస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మరమ్మల మల్లేశ్ మాదిగ తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన వ్యవస్థాపక అధ్యక్షుడిగా మల్లేశ్ యాదిగ, రాష్ట్ర అధ్యక్షుడిగా మొండికత్తి లింగన్న మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా మెట్టుపల్లి కొమురయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ సంకటి శామ్యూల్, ఉపాధ్యక్షులుగా ఎర్రా ఆంజనేయులు, కొండూరి రాజు, బొట్ల రమేష్, రాష్ట్ర ఇన్‌చార్జి ధర్మతేజ ఎన్నికయ్యారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో తక్షణమే చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ వర్సిటీతో 'రాంరెడ్డి' ట్రస్ట్ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈమేరకు మంగళవారం విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.సీతారామారావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీఆర్‌ఎన్ రెడ్డి, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి హరగోపాల్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అంబేడ్కర్ వర్సిటీ వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాంరెడ్డి ఆశయాలను భవిష్యత్తు తరాలకు చేరేలా, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడేలా ఏటా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాంరెడ్డి స్మారక కార్యక్రమాల నిర్వహణ కోసం రూ.11,50,000 చెక్కును ట్రస్ట్ కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్, ట్రస్ట్ సలహాదారు, మాజీ వీసీ వీఎస్‌ప్రసాద్ తదితరులు రిజిస్ట్రార్ ఏవీఆర్‌ఎస్ రెడ్డికి అందించారు. సమావేశంలో విశ్వవిద్యాలయం డైరెక్టర్లు పుష్ప చక్రపాణి, సుధారాణి, ప్రొఫెసర్ రాంరెడ్డి కుమార్తె జ్యోతి, మాజీ ప్రొఫెసర్లు ఘంటా చక్రపాణి, వెంకటయ్య, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

హైడ్రాలిక్ కంపెనీలో అగ్నిప్రమాదం



ముసాపేట: ప్రశాంత్‌నగర్‌లోని శక్తిపురంలో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో హైటెక్ హైడ్రాలిక్ కంపెనీలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పై అంతస్తుల్లో ఉన్న కార్యాలయ సిబ్బంది అప్పటికే వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పై అంతస్తుల్లో మంటలు ఎగిసిపడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు.

మద్యం మత్తులో మహిళ హల్‌చల్



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం మద్యం మత్తులో ఓ మహిళ హల్‌చల్ చేసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం మత్తులో ఓ మహిళ చిన్నారిని ఎత్తుకుని బస్సు చార్జీలకు డబ్బులు కావాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట అరుస్తూ.. రాళ్లతో కార్ల అద్దాలను పగులగొట్టింది. ఓ పోలీస్ వాహనం అద్దం కూడా పగిలింది. సుమారు గంట సేపు అరుస్తూ రాళ్లతో కొట్టటం, చిన్నారిని కొడుతూ హల్‌చల్ చేసింది. ఎంతకీ వినకపోవడంతో పోలీసులు ఆమెకు చార్జీలకు డబ్బులు ఇచ్చి పంపించేశారు. అయితే జనగామ నుంచి వచ్చిందని పోలీసులు తెలిపారు. జగద్గిరిగుట్టలో మద్యం సేవించి మత్తులో తిరుగుతుండగా స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు పంపడంతో వచ్చి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. జనగామ వెళ్తానని చెప్పడంతో డబ్బులు ఇచ్చి పంపించామని పేర్కొన్నారు.

'అన్ని ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం'

లిబర్టీ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపుతామన్నారు. ఈక్రమంలో ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. సమావేశంలో నాగిళ్ల నవీన్‌కుమార్, అరుణరెడ్డి, నందికొండలరావు పాల్గొన్నారు.